# అక్షింతలు

చందు సోంబాబు



ఆకాశంలో నల్లమబ్బులు దాడి మొదలుపెట్టినయి. చీకటి తెరలు అలుముకుంటున్నాయి. మెల్లగా మొదులైన చిఱుగాలి, పెను గాలిగా మారిపోడంతో చెట్లు ఆ గాలి ధాటికి తట్టుకోలేక అల్లాడిపోతున్నాయి. రోడ్డుపైన దుమ్ము చక్రాల్లా లేస్తోంది.

ఉరుములు, వాటితో పాటుగా మధ మధ్య కత్తుల్లాంటి మెరుపులు, కళ్ళుపోయేలా మెరుస్తున్నాయి. ఆకాశం గుండె పగిలింది. పగిలిన ఆ గుండెలోంచి చినుకులు ....

వాన ప్రారంభమైంది.

రామనాథంగారికి వర్షమంటే చెడ్డ సరదా. మండువా ఇంటి అరుగుపైన కూర్చొని ఆహ్లాదంగా వున్న వాతావరణాన్ని తిలకిస్తేరు. చినుకులు పెద్దవై అరుగుపైకి కొట్టడంతో లోపలికొచ్చి ఈజీచైర్లో కూర్చున్నారు.

శాంతమ్మ గది గుమ్మంలో కూర్చొని లాంతరు గ్లాసుని పాతగుడ్డతో తుడుస్తోంది. రామనాథంగారు భార్యకేసి చూస్తూ అన్నారు.

"బొత్తిగా తోచడం లేదోయ్. వాన రాకపోతే బాగుండేది."

శాంతమ్మ నవ్వింది. ఆవిడ నవ్వితే ప్రశాంతంగా ప్రవహించే గంగానది ఉలి పడినట్టుగా వుంటుంది. అదీగాకుండా ఆమె మొహంలో చిరునవ్వెప్పుడూ కొట్టొచ్చినట్టుగా వుంటుంది.

"ఓ పని చెయ్యకూడదూ?" అందామె.

"ఏమిటి?" అడిగేరు ఆసక్తిగా రామనాథంగారు.

"ఈ లాంతరు తుడవండి."

"లాంతర్నా, నీ ముసలి బుగ్గల్నా" చిలిపిగా అడిగారు.

శాంతమ్మ చిరుకోపం నటించింది.

"చాల్లెండి పెద్ద. అయినా నేనేం ముసలిదాన్ని కాను. మీకంటే పదేళ్ళు చిన్నదాన్ని."

రామనాథం మాస్టారు నవ్వుకున్నారు.

"కిటికి తలుపులు మూసి రండి" అంది శాంతమ్మ లాంతర్లో గ్లాసుని పెడుతూ.

మాస్టారు చిలిపిగా నవ్వి అన్నారు.

"ఎటుకానివేళ కిటికీలు వేయడం దేనికీ"

ఆయన మాటలకి ఉలిక్కిపడింది శాంతమ్మ.

"చాల్లెండి సరసం?" అని లేచి లోపలికెళ్ళిందావిడ.

మాస్టారు తిరిగి అరుగుమీద కెళ్ళారు.

వర్షం జోరుగా కురుస్తోంది.

గాలి విసురుని తోడుచేసుకోడం చేత వర్షం ఓ దిక్కుగా కాకుండా, ఎటుపడితే అటే కొడుతోంది. ఓ పక్క చీకటి పూర్తిగా కమ్ముకొచ్చింది.

రోడ్డుపైన నీరు వరదలా ప్రవహిస్తోంది. చుట్ట వెలిగించి, మధ్యమధ్య అరుగుపైకి దాడి చేస్తున్న వర్షపు జల్లు వంటికి తగుల్తుంటే పరధ్యానంగా అరుగుపైన నించుండిపోయారు మాస్టారు.

"మీకింకా పసితనపు చేష్టలు పోలేదు."

ఆ మాటలకి వెనక్కి తిరిగి చూశారు రామనాథంగారు.

శాంతమ్మ పమిట చెరగుతో చేతులు తుడుచుకుంటోంది.

"ఈవేళ పాఠాలు చెప్పించుకోడానికి పిల్లలు రాలేదు చూశావా, శాంతా" అన్నారు.

"బాగుంది వరస. ఓ పక్క కుంభవృష్టి దంచుతుంటే పిల్లలు పాఠాలు చెప్పించుకోడానికి రాలేదంటున్నారా?" అంది శాంతమ్మ.

"మన వరస సంగతి తర్వాతగానీ, అమ్మాయి ఏం చేస్తోంది?"

"మీ మాటల్లోపడి దాని సంగతి మర్చిపోయాను." ఏంచేస్తోందో అంటూ శాంతమ్మ గబగబ లోపలికి వెళ్ళింది.


శాంతమ్మ గుమ్మంలో నించొని కూతురికేసి ప్రేమగా చూసింది.

పచ్చని కొబ్బరాకుల పై గువ్వలా కూర్చుంది సుమిత్ర.

గుమ్మంలో అలికిడికి తలెత్తి చూసింది.

"ఏం తల్లీ ఒంటరిగా భయంగా వుందా?"

సుమిత్ర తల్లి మాటలకి సుతారంగా



నవ్వింది. అప్పుడు కనురెప్పలు రెపరెప లాడేయి. బుగ్గలు సొట్టపడ్డాయి. చిన్నినోరు అందంగా ఒంకర్లు తిరిగింది.

సుమిత్ర పెదవులపైన కదిలే నవ్వు ఇప్పుడోవిధమైన కొత్త అందాన్ని సంతరించుకొంది.

"అమ్మా, ఇంకా ఈ ఆకులపై మూడు రోజులు కూర్చోక తప్పదా?"

"ప్రతి ఆడపిల్లకీ జీవితంలో ఇది ప్రధాన ఘట్టం తల్లీ! ఇలాంటప్పుడు పచ్చని ఆకుల పైన కూర్చోవాలి. ఇది ఆచారం. కారణం ఆడపిల్ల జీవితం పచ్చగా నూరేళ్ళు వుండవాలన్న ఆకాంక్షతోనమ్మా" అంది శాంతమ్మ.

"ఏమో నాకైతే చచ్చేంత సిగ్గుగా వుంది. నువ్వింత గొడవచేస్తావని తెలిస్తే నీకసలు ఏమీ చెప్పేదాన్నికాదు" అంది సుమిత్ర.

కూతురి మాటలకి ఆ తల్లి నిండుగా నవ్వుకుంది.

"నా తల్లి బంగారు తల్లి" అనుకుంది.

"పక్కింటి బుజ్జిగాడ్ని, లక్ష్మిని పంపవే నాకసలు తోచడంలేదు."

"అలాగే," అని శాంతమ్మ వెళ్ళిపోయింది.

సుమిత్ర చేతిలోకి అద్దం తీసుకుంది. దానిలో తన ప్రతిబింబాన్నోసారి చూసుకొంది. కారణం సరిగా తెలీకపోయినా తన ప్రతిబింబం తనకే చూడముచ్చటగా అనిపించింది.

"నేనింత అందంగా వుంటానా?" అని కొన్నిక్షణాలు ఆశ్చర్యపోయింది సుమిత్ర. నిన్న లేనిదేదో కొత్తగా తనలో ప్రవేశించింది. గుండెల్లో ఏదో తెలీని స్పందన. అదేమిటో వింతగా వుంది. దానికి తగ్గట్టుగా తల్లి మాట్లాడే ప్రతిమాటా కొత్త అర్థాన్ని సూచిస్తోంది.

ఓ పక్క సిగ్గు, మరోపక్క అదోలా అందమైన భయం గుండెల్లోనూ, మనసులోనూ కదులుతున్నాయి. అద్దాన్ని పక్కగా పడేసి లేచి నించొని, కిటికీలోంచి బయటకి చూసింది.

వాన కురుస్తోంది.

సుమిత్ర కిటికీదగ్గరే నించుంది. ఇంకా బుజ్జిగాడు, లక్ష్మిరాలేదు.

వాన రాకపోతే బంధువులనో, స్నేహితులనో ఎవరో ఒకరు తనని చూడ్డాని కొచ్చే వాళ్ళు. తనకి చచ్చేంత ఇబ్బందిగా వుంది. అమ్మకి చెప్పినా వినదు.

వీధి దీపం వెలుగులో నీళ్ళు పారుతూ కనబడుతున్నాయి.

వాననీళ్ళల్లో కాగితపు పడవలు చేసి ఆడుకోడం సుమిత్ర కిష్టం.

వర్షంలో తడుస్తూ గాలికిపడ్డ బాదం కాయలు ఏరుకునేది. ఇప్పుడు మాత్రం ఏమైందేమిటి? అమ్మ కాస్త 'ఊఁ' అంటే తను పరుగుతీస్తుంది.

వాన జల్లుపడుతోంది కిటికీలోంచి. కిటికీ తలుపులు మూసి కూర్చుంది. అమ్మ తనకోసం అక్కడపెట్టిన తాటాకు బొమ్మనీ, చెక్కబొమ్మనీ చేతుల్లోకి తీసుకుంది. వాటికి ఏవో అలంకారాలవీ చేసింది. అమ్మ.

అవి రెండూ మొగుడుపెళ్ళాలట, చిత్రంగా వుంది.

చిన్నప్పుడు తనెన్నోసార్లు అన్నాలాట, మొగుడు పెళ్ళాలాట ఆడుకొంది.

తను పెళ్ళాం.

చలపతి మొగుడు.

బుజ్జిగాడు, లక్ష్మి పిల్లలుగా సాగేది ఆట. చలపతి సన్నగా, రివటలా, సరువుమొక్కలా వూగిపోతుంటాడు.

చలపతి చాలా చిలిపి పిల్లాడు. అలా అనుకొన్నప్పుడు సుమిత్రకి చిన్న సంఘటన గుర్తుకొచ్చి సిగ్గుతో రెండు చేతుల్లో మొహాన్ని దాచేసుకుంది.

పొలంనించి గడ్డి బళ్ళొచ్చాయి. వాములు కట్టారు. వాముపక్కగా బొప్పాయి చెట్టుంది. ఆరోజు ఆట పూర్తయింది. చలపతి వెనగ్గా వచ్చి బుగ్గపైన ముద్దుపెట్టుకున్నాడు.

"ఏయ్ అమ్మకి చెప్తాను!"

"చెప్పుకో భయమా? నువ్వు నా పెళ్లానివి. పెళ్ళాన్ని మొగుడు ముద్దుపెట్టుకోవచ్చు. కావాలంటే మా డాడీని అడుగు." అన్నాడు.

చెంపపైన చేత్తో రాసుకుంది సుమిత్ర.

"చలపతి ఇప్పుడూ చేస్తాడా?"

"అలా చేస్తే తనేం చెయ్యాలి?"

"ఏమో?"

తనలాగే చలపతిలోనూ బోల్డు మార్పొచ్చి వుంటుంది. అందునా చలపతి ఇప్పుడు వాళ్ళ అత్తమ్మ దగ్గర హైదరాబాదులో చదువుకుంటున్నాడు.

చలపతిని చూసి సంవత్సరం దాటింది.

చలపతి వెళ్ళిపోతుంటే ఏడుపొచ్చింది తనకి.

అతను తనలా ఏడవలేదు. చాలా ఉత్సాహంగా కొత్తవూరు అత్తమ్మతో కలిసి వెళ్ళిపోయాడు.

తనకి బాగా గుర్తుంది. అతను రిక్షా ఎక్కుతుంటే అడిగింది

"చలపతీ, నెలకోసారి వస్తావుకదూ?" అని.

చలపతి సరే నన్లేదు. మీదు మిక్కిలి నవ్వేశాడు.

"నయం రోజుకోసారి రమ్మన్నావుకాదు. హైదరాబాదంటే ఏమనుకున్నావో" అన్నాడు.

. తన కేడుపొచ్చింది. ఆ రోజంతా బాదం చెట్టుకింద కూర్చొని ఏడ్చింది.

గదిలోకి బుజ్జిగాడు, లక్ష్మి వచ్చారు.

బుజ్జిగాడు సుమిత్రకేసి అయోమయంగా చూసి, అడిగాడు.

"నిన్ను ముట్టుకోకూడదు కదూ?"

"అవును" నవ్వింది సుమిత్ర.

"ఎందుకని?"

'నిజమే ఎందుకు ముట్టుకోకూడదు' తనకే తెలీదు.

'చెప్పవే' మళ్ళీ బుజ్జిగాడి ప్రశ్న.

"నాకు తెలీదురా. అమ్మ నడిగి చెప్తాను."

"అయితే నేను నీ దగ్గరే పడుకుంటాను."

"తప్పురా."

"నాకు భయం."

"చలపతన్నయ్య వస్తున్నాట్ట" అంది లక్ష్మి.

ఆ మాటలకి ఉలికిపడింది సుమిత్ర. ఆనందం కట్టలు తెంచుకుంది.

"ఎప్పుడు?" అడిగింది ఆత్రంగా.

"ఆదివారం."

"ఇంకా అయిదు రోజులే" అనుకోకుండా బయటికి అనేసింది.

సంవత్సరంగా ఆతను కనపడకపోయినా వుండిగలిగిన మనిషి వస్తున్నాడని తెలిసేక ఇంకా అయిదురోజుల వ్యవధి చాలా రోజులున్నట్టుగా అనిపించింది సుమిత్రకి.

"అన్నయ్య వచ్చేక అన్నాలాట ఆడుకుందామా?" బుజ్జిగాడు అడిగాడు.

"ఓ" అంది. కానీ ఇదివరలోలా చలపతితో కలిసి ఆడితే, అమ్మ వూరుకుంటుందా?

కానీ చలపతి గురించి తను బంగారు కలలు కంటోంది.

ఆ రాత్రి సుమిత్రకి నిద్ర కరువైంది. మగత నిద్రలో అన్నీ కలలే. బుజ్జిగాడి కలవరింతలు మధ్య మధ్య సుమిత్ర చెవుల్ని తాకుతూనే వున్నాయి.

వాన తగ్గుముఖం పట్టనట్టనిపించినా ఆ రాత్రి ముసురు పట్టింది.

* * *

"చలపతొచ్చాడు!!" లక్ష్మి చెప్పి వెళ్ళింది సుమిత్రకి.

గుండెల్లో ఏదో కలవరం. పరిగెత్తికెళ్ళి అతన్ని చూడాలన్న తపన.

అతని రెండు చేతులు పట్టుకొని, 'చూడు చలపాయ్, నేనెంత మారిపోయానో' అని చెప్పాలి.

అప్పుడు తనేం చేస్తాడో చూడాలి.

కానీ.... తనకేమిటో పోగొట్టుకున్నట్టుగా వుంది.

ఇదివరకెంతో బాగుండేది. అతను ఊళ్ళో కొచ్చి రెండు గంటలు దాటిపోయింది.

"సుమీ" అంటూ తనని చూడ్డానికి పరిగెత్తుకొస్తాడని ఎదురుచూసింది. అతనలా రాకపోయేసరికి తుఫానుకి గురి అవుతున్న సముద్రంలా తల్లడిల్లి పోయింది సుమిత్ర.

కొంపదీసి చలపాయ్ తనని మర్చిపోలేదు కదా!

కిటికీలో కూర్చుని చెంపపైన చెయ్యి ఆనించి ఆశగా రోడ్డుపైకి చూస్తోంది.

చలపాయ్ తనని చూసి ఆశ్చర్యపోతాడు.

లంగా జాకెట్లు మానేసి ఓణీలు వేస్తోంది. తనిప్పుడు పిలక జడకి బదులుగా రెండు జడలు వేస్తోంది కాళ్ళకి ఎత్తుచెప్పులు.

గుర్తుపట్టలేనంతగా మారిపోయింది తను.

ఎవరో వెనగ్గా వచ్చి కళ్ళు మూసేరు.

"చలపాయ్," అంటూ చేతులు పట్టుకొంది. ఆ చేతులకి గాజులున్నాయి.

"ఇదేమిటి, చలపతి చేతులకి గాజులున్నాయి" అనుకొంది ముందు.

అటు తర్వాత కిటికీలోంచి కిందికి దుమికింది.

ఎదురుగా లక్ష్మి. గలగల నవ్వేసింది.

"కొంటె పిల్ల" అని లక్ష్మి చెవిని మెలిపెట్టింది సుమిత్ర.

లక్ష్మి చెవిని విడిపించుకొని అంది.

"అన్నయ్య నిన్ను రమ్మని చెప్పాడు."

"ఏం తను రాకూడదూ?"


With best compliments from :

Phone : 57496

**Electrical Construction & Equipment Company**

3-5-1114, KACHIGUDA CROSS ROAD, BESIDE BANK OF INDIA

**HYDERABAD 500 027.**

**AGENTS FOR THE PRODUCTS LIKE :**

Time-Relays, Programme Timers, Cam-Timers, Time-Switches, Ramon Protection on Pluging, Anti Pluging, Solderless Crimping Cable, Jointing Tools & Lugs, Approved by Siemens.

Clip on type terminals, Siemens Type Brass Cable Clands.

Wiring system Accessories, Cable Markers for various wiring system.

Electrically hand operated Sirens, Hooters, industrial calling bells, Buzzers, Blowers Mergency Light.

Iron Clad switch Gears, Motors, Pump sets and Electrical wiring accessories.

"ఏమో నాకేం తెలుసు?"

"నేను రానని చెప్పు."

లక్ష్మి తుర్రుమంది. సుమిత్రకి కోపం వచ్చింది.

పెద్దు హైద్రాబాదు వెళ్ళొచ్చేసరికి బాబాయి గారికి పెక్కు బలిసిపోయింది.

"అసలు చలపతితో మాట్లాడకూడదు" అనుకొంది.

—గుమ్మంలో చలపతి నవ్వుతూ నించొన్నాడు.

తనతన్ని గుర్తుపట్టలేక పోయింది.

ఎత్తు బూట్లు, బెల్‌బాటమ్సు, బాగా పెరిగిన జుత్తు, పెద్ద కళ్ళద్దాలు.

సుమిత్ర అతనికేసి చూస్తూ కొన్ని క్షణాలు అలాగే వుండిపోయింది.

"హీరోలా వున్నావు చలపతీ" అని మనసులో అనుకొంది.

అటు తర్వాత కొత్తగా సంతరించుకొన్న అందంచేత సిగ్గుగా తలదించుకొంది అతను తన దగ్గరకి నడిచివస్తుంటే అప్పుడప్పుడే కొత్త అందాలకి తీరికలను దిద్దుకొంటున్న సుమిత్ర గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

చలపతి సుమిత్ర భుజాలపైన చేతులువేసి తనవేపుకి తిప్పుకున్నాడు.

తలెత్తి బెదురుతున్న చూపులతో అతని కళ్ళలోకి చూసింది.

మొహంపైకి పడుతున్న జుత్తుని ఎడం చేత్తో అందంగా వెనక్కి తోసుకున్నాడు చలపతి.

"నేను గుర్తున్నానా?" అడిగేడు.

"ఆ మాట నేనడగాలి" అంది

"నువ్వు నా కెప్పుడూ గుర్తుంటావ్!"

చురుగ్గా అతని కళ్ళలోకి చూసింది. అదే కళ్ళు అదే చిలిపితనం.

"నాకోసం ఏం తెచ్చావ్?" అడిగింది.

"వాచీ తెచ్చాను."

సుమిత్రకి ఆ బహుమతి నచ్చలేదు.

"నాకంటె పెద్దబహుమతి వేరే కావాలా?" అంటాడేమో అనుకొంది.

పైగా అతను తనలో మార్పుని గమనించకపోవడం బాగోలేదు సుమిత్రకి. అతను తన చేతికి రిస్టువాచ్ కట్టబోతుంటే అంది.

"తప్పు. ఇలా ఆడపిల్లల్ని ముట్టుకోకూడదుట."

చలపతి అహం దెబ్బతిన్నట్టు చూశాడు.

అతను వాచీని కుర్చీపైకి పెట్టేసి విసురుగా వెళ్ళిపోయాడు.

సుమిత్ర అయోమయంగా నాలుగడుగులు వేసి ఆగిపోయింది. తను సరదాగా అందే కానీ, అతనలా తీసుకుంటాడనుకోలేదు.

'చలపతి మారిపోయాడు' అనుకొంది.

అలా అనుకొన్నప్పుడు కళ్ళల్లో నీరు గిర్రుమని తిరిగింది.

సాయంత్రం వరకు పిచ్చి ఆలోచనల్లో వుండిపోయింది.

రాత్రి ఏడుగంటలప్పుడు రామమందిరంలో పురాణం చెప్తుతుంటే వెళ్ళి మంటపం మెట్టుపైన కూర్చొంది.

చలపతి పదిగజాల దూరంలో వున్నాడు. ఆమె వెళ్ళింది అతని దగ్గరకి.

"పొద్దున కోపం వచ్చిందా?" అడిగింది.

"నీకు బాగరెక్కువైంది!" అన్నాడు.

"నీకు కోపం వచ్చేలా ప్రవర్తించానంటే, నాకు అనిపిస్తోంది నీ మాట నిజమే అని."

చలపతి మాట్లాడలేదు.

"నేను చదువు మానేశాను" అంది.

"ఏం?"

"అమ్మ కిష్టంలేదు. అసలు నేను ఎవరితోనూ మాట్లాడకూడదట."

"నువ్వు తప్పేం చేశావని?" అడిగాడు.

సుమిత్రకి నవ్వొచ్చింది "ఆడపిల్లని కావడమే."

"నువ్వు చాలా మారిపోయావ్."

"అవును. ఆ మార్పునే నువ్వు తెలుసుకోవాలి."

చలపతి నవ్వి "పద అటు వెళదాం" అన్నాడు.

చలపతితో పాటుగా అడుగులేస్తూ ముందు ఏడు అడుగులు వేసి ఆగిపోయింది.

"ఆగిపోయావేం?" అడిగాడు.

"నీతో ఏడడుగులు నడిచాను."

"ఏడు వేలడుగులు నడద్దూగానీ పద."

వెన్నెల విరగకాస్తోంది. ఆకాశం చెల్లాచెదురుగా వున్న నక్షత్రాల గుంపుతో బెజవాడ గవర్నర్‌పేటలా వుంది.

చెరువుకట్ట పక్కగా వున్న రావిచెట్టు దిమ్మపైన కూర్చున్నా రిద్దరూ.

"రేపు బొమ్మలపెళ్ళి చేస్తున్నాను" అంది.

"నేనొచ్చాననా?"

"కాదు. అమ్మ చెప్పింది ఆడపిల్లలు బొమ్మలపెళ్ళి చేస్తే త్వరగా పెళ్ళవుతుందట."

"అప్పుడే పెళ్ళికూతురై పోవాలనుందా?"

సుమిత్ర మాట్లాడలేదు. అతనింకేమైనా మాట్లాడతాడని ఆశపడింది.

కానీ అదేమి పట్టకుండా వసపోసినట్టుగా హైదరాబాదు కబుర్లు చెప్పాడు. విసుగనిపించినా అన్నీ వింది. ఎన్నో మాట్లాడాలనిపించినా చలపతి ధోరణి చాలా చిన్నవాడిలా అనిపించింది.

అసంతృప్తిగా లేచి వొచ్చింది ఇంటికి.

మర్నాడు తోటలో చిన్న పందిరి వేసి బొమ్మలపెళ్ళి చేస్తుంటే చలపతి వచ్చి కాస్త దూరంలో కాళ్ళచుట్టు చేతులు కట్టుకుని కూర్చున్నాడు.

"నేను రావచ్చా పెళ్ళికి" అన్నాడు.

"ఇది ఆడపిల్లలాట. మగపిల్లలు రాకూడదు" అంది.

"మ రిదివరకు ఆడేవాళ్ళంకదూ?"

"నువ్విప్పుడు మొగాడివి. పైగా నీ చిలిపి పనులు నాకు గుర్తున్నాయి" అంది.

చలపతి నవ్వేడు. మొహం పైకి పడ్డ జుత్తుని ఎడంచేత్తో వెనక్కి తోసుకుంటూ, "ఇప్పుడలా చేస్తే ఏం చేస్తావ్" అన్నాడు.

"నీ మెడలోంచి నా మెడలో తాడు కట్టించుకొంటాను."

"నువ్వు రౌడీ పిల్లవి" అన్నాడు గులకరాయిని సుమిత్రపైకి విసురుతూ.

"ఎన్ని రోజులుంటావిక్కడ?" అంది, సుమిత్ర.

"మూడునెల్లు."

"చాలారోజులుంటావన్నమాట" అంది. మూడునెల్లేనా అన్న అసంతృప్తి మనసులో లేకపోలేదు.

"పోనీ వెళ్ళిపోనా?"

"నే నెవర్నని?" ఆ మాటలంటూ అనుకుంది. "నువ్వే నా సర్వస్వానివి అంటాడేమో" నని ఆశపడింది.

చలపతి రూపురేఖల్లో మార్పొచ్చిందే కానీ అతని బుద్ధికానీ, ఆలోచనలుకానీ పెరగలేదనిపించింది.

పదిహేను రోజుల తర్వాత ఓ రోజు ఎవరో రావటం అమ్మా, నాన్న, తనని అలంకరించి వాళ్ళకి చూపించారు. సుమిత్రకి ముందు ఏమీ బోధపడ్లేదు. వాళ్ళు తననేమీ అడగలేదు. అది పెళ్ళిచూపులట. 'తనకిష్టం లేదు. కానీ తన ఇష్టాయిష్టాలు అమ్మ

నాన్నకీ అవసరంలేదు. ఆ నెల్లోనే ముహూర్తం పెట్టారు.

ఏడుపొస్తోంది. తనకి పెళ్ళి నిశ్చయమైపోయినట్టు తెలిస్తే చలపతి ఏమంటాడు? మోసం చేసానని నింద ఆరోపిస్తాడు. దేవదాసులా అయిపోతాడు—అసలే సున్నితమైన మనసు చలపతిది.

ఆ సాయంత్రం రామ మందిరం దగ్గర చలపతి కలిశాడు. చాలాసేపు సుమిత్ర మాట్లాడలేదు.

చలపతి చనువుగా అడిగాడు.

"నాతో మాట్లాడవా?"

సుమిత్ర కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"నీతో మాట్లాడకుండా నేను బ్రతకలనా?" అనుకొంది.

"నా పెళ్ళట." అంది అతనికేసి పరీక్షగా చూస్తూ.

చలపతి ఉత్సాహంగా చూశాడు.

తన మాటలకి బాంబు పేలినట్టు ఉలిక్కిపడతాడనుకొంది. అదేమీ లేకపోగా అత్యంత ఉత్సాహంగా చూసేసరికి నీరు కారిపోయింది.

"నాకు చెప్పకుండానే ఏర్పాటుచేసుకున్నావన్నమాట!"

"నాకు తెలీదు. అమ్మానాన్నా చేస్తున్నారు."

"పెళ్ళికొడుకు బాగుంటాడా?"

ఉక్రోషంగా చూసిందతన్ని. ముఖం కట్టలు తెచ్చుకొంటోంది.

"పెళ్ళికొడుకా? అతనికేం దర్జాగా వుంటాడు. పెళ్ళికొడుకు ఇంజనీరుకూడాను."

"అయితే నాకు బోల్డు పనన్నమాట."

చలపతిని చాచిపెట్టి కొట్టాలనిపించింది.

"చలపాయ్! నాకు పెళ్ళవుతే ఇంకో ఊరు వెళ్ళిపోతాను. నీకసలు కనిపించను. అది నీకు బాధగా వుండదూ?" అడిగిందతని చేతులు పట్టుకుంటూ.

"బాధా? దేనికి?"

"నేను కనిపించకపోతే నీకు ఏదోలా వుండదూ?"

చలపతి నవ్వేడు.

"భలేవానివే సుమీ! పెళ్ళయితే మరో ఊరు వెళ్ళక నేను బాధపడ్తానని మీ ఇంట్లోనే వుండిపోవాలనుకుంటున్నావా?" అన్నాడు.

"కానీ నువ్వు...."

"బాగుంది నీ గోల. మొన్న మా అక్కయ్య వెళ్ళవుతే పెళ్ళిపోలేదా?"

"అంతేకానీ! నేను లేకపోయినా నువ్వు ఆనందంగా వుండగలవన్నమాట." సుమిత్ర కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది.

ఆ క్షణంలో చిన్నప్పట్నించీ ఆడుకొన్న ఆటలన్నీ కళ్ళకి కట్టినాయి. ఆడపిల్లలకి మనసెదిగినంత త్వరగా మగపిల్లలకి ఎదగదనిపించింది సుమిత్రకి. ఆ మాటకొస్తే చలపతి వయసులో కూడా తనకంటె ఓ పదిరోజులు చిన్నవాడేను. అయినా అదో పెద్ద కారణం కాదు. చలపతంటే తనకి ప్రాణం.

"కానీ నిన్నొదిలి నేను దూరం వెళ్ళలేను. నువ్వు నాక్కావాలి చలపతీ! నీ చెలిమి లేకపోతే నేను బ్రతకలేను. నువ్వు నా లోకం" అని అరవాలనిపించింది.

కళ్ళవెంట నీరు జారుతుండగా గుండెలు ఎగిసిపడుతుండగా, "నువ్వొట్టి చవటవి!" అని చలపతి చెంప పగిలేలా కొట్టి, ఏడుస్తూ అక్కడ్నించి పరుగుతీసింది సుమిత్ర.

చలపతికి మతిపోయింది. సుమిత్ర తననెందుకు కొట్టిందో అర్థంకాలేదతనికి.

—ఆ రోజు సుమిత్ర పెళ్ళి. చలపతి పెళ్ళికి వెళ్ళకూడదనుకున్నాడు. కాని అందరూ వెళుతుంటే వెళ్ళక తప్పలేదు.

పెళ్ళి మంటపానికి దగ్గరగా నించున్నాడు. పెళ్ళికొడుకు చాలా బాగున్నాడు. సుమిత్ర చెప్పినట్టు అతను దర్జాగానే వున్నాడు.

సుమిత్ర అదృష్టవంతురాలు.

పురోహితుడు అందరికీ అక్షింతలిస్తున్నాడు. చలపతి చెయ్యి చాపాడు.

"చిన్నపిల్లలు అక్షింతలు వేయకూడదు" అన్నాడు పురోహితుడు.

చలపతి కోపం పట్టలేక పళ్ళెంలోని అక్షింతలు గవాల్న చేతుల్లో తీసుకున్నాడు.

మంగళవాద్యాలు మోగుతున్నాయి. సుమిత్ర మెడలో మంగళసూత్రం కడుతున్నాడు ఇంజనీరుబాబు. అక్షింతలు వర్షం కురుస్తుండగా చలపతి కూడా అక్షింతలు వేయబోయాడు.

సరిగా అదే సమయంలో సుమిత్ర తలెత్తి చూసింది.

కళ్ళలో నీరు....

చలపతి ఆగిపోయాడు.

అతనికి ఆ సమయంలో సుమిత్రతో కలిసి ఆడుకున్న సంఘటనలు గుర్తుకొచ్చాయి. సుమిత్ర మాట్లాడిన ప్రతి మాట అంకుశంలా గుండెని ఛేధిస్తున్నట్టుగా అనిపించింది.

"నాకు పెళ్ళవుతే ఇంకో వూరు వెళ్ళిపోతాను. నీకసలు కనిపించను. నీకు బాధగా వుండదూ?" అన్న సుమిత్ర మాటలు చలపతి మనసుని చెరకురసం పిండినట్టుగా పిండసాగినాయి.

అంతే! అతనికేదో స్ఫురించింది.

ఛర్నాకోలతో వీపుపైన కొట్టినట్టయింది. ఏడుపొస్తోంది.కళ్ళల్లోకి నీరు పొంగుకొస్తోంది.

"నీ మనసుని చదవలేక నిన్ను పోగొట్టుకొన్న ఇడియట్‌ని. అయామ్ ఎ ఫూల్ సుమీ!" అంటూ అరవాలనిపించింది.

అతని మనసు స్వాధీనం తప్పింది.

చిన్నతనంనించి లతలా పెనవేసుకుపోయిన నేస్తాన్ని చేజేతులా దూరం చేసుకొన్న తెలివితక్కువతనానికి, సుమిత్ర తన కర్థం అయ్యేలా చెప్పడానికి ప్రయత్నించినా అర్థంచేసుకోలేకపోయిన తన మూర్ఖత్వానికి తట్టుకోలేకపోయాడు.

అతనికి తెలీకుండానే ఏడుపొచ్చింది. స్తంభాని కానుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. పందిట్లో పెద్దవాళ్ళకి అతని ధోరణి అర్థంకాలేదు. ఎవరో పలకరించబోయారు. ఆ మనిషిని విదిలించికొట్టాడు చలపతి.

తననందరూ వింతగా చూస్తున్నారనిపించింది.

సిగ్గు, బాధ, ఆవేశం అన్నీ ఒక్కసారిగా ముంచుకొచ్చినయి.

అక్కడ నించోలేక పందిరిలోంచి బయటికి పరుగుదీశాడు.

రామమందిరందగ్గరకొచ్చి ఓక్షణంఆగేడు. పిడికిలిలో వున్న అక్షింతలకేసి చూశాడు.

అక్షింతలు....

గుడిమంటపం మెట్టుపైన కూలబడిపోతూ, చేతిలోని అక్షింతలని గట్టుపైన పోశాడు.

అవి అతన్ని పరిహసిస్తుండగా దూరంగా మంగళవాద్యాలు వినబడుతుండగా, తలని రెండు చేతుల్లోనూ పట్టుకుని చలపతి చతికిలపడిపోయాడు.

